పత్రికా ప్రకటన - 1

# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

తేదిః 6.08.2014

తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణంలో టాటా గ్రూప్ సంస్థలు భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు కోరారు. తెలంగాణ రాష్ట్రంలో పారిశ్రామిక, ఐటి, విద్య, మౌలిక సదుపాయాల కల్పన తదితర రంగాలలో సత్వర అభివృద్ధి కోసం ప్రత్యేక విధానాలు రూపొందిస్తున్నామని చెప్పారు. ఈ రంగాల్లో విశిష్ట అనుభవం వున్న టాటా కన్సల్టేన్సీ సలహాలు, సూచనలు తీసుకొంటామని ముఖ్యమంత్రి ప్రకటించారు.

ముఖ్యమంత్రి అధికార నివాసంలో బుధవారం టాటా గ్రూప్ సంస్థల చైర్మన్ సైరస్ మిస్త్రి (Cyrus Mistry) తన ప్రతినిధి బృందంతో కేసిఆర్‌ను కలిశారు. తెలంగాణ రాష్ట్రంలో అవలంభించబోయే పారిశ్రామిక విధానం ముసాయిదా చాలా బాగుందని, తెలంగాణలో పారిశ్రామిక అభివృద్ధికి ఆ విధానం ఎంతో దోహద పడుతుందని చెప్పారు. పరిశ్రమలతో పాటు తెలంగాణలో ఐటి అభివృద్ధి, గ్రామీణాభివృద్ధి, హైదరాబాద్ నగరాభివృద్ధి, కేజి టూ పిజి ఉచిత విద్య పథకం, అందరికి వైద్యం అందించే కార్యక్రమాలు చేపడుతున్నామని, ఏ రంగాన్ని కూడా విస్మరించకుండా సమగ్ర అభివృద్ధి సాధించాలన్నది తమ లక్ష్యమని ముఖ్యమంత్రి కేసిఆర్ చెప్పారు. తెలంగాణలో పారిశ్రామిక భూములపై సర్వే జరుగుతోందని త్వరలోనే వ్యూహం ఖరారు చేస్తామని వెల్లడించారు. హైదరాబాద్ నగరంలో దాదాపు 1700 నోటిఫైడ్ స్లమ్స్ వున్నాయని వాటిలో ఇండ్లు, రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాల్సి వుందన్నారు. వీటన్నింటికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించి చిత్తశుద్ధితో పనిచేస్తుందని అయితే విధానాల రూపకల్పనలో, వ్యూహాల ఖరారు, అమలులో టాటా కన్సల్టెన్సి భాగస్వామ్యం అవసరమని ముఖ్యమంత్రి చెప్పారు.

కేవలం పారిశ్రామిక, ఐటి రంగాల్లోనే కాకుండా చాలా రంగాల్లో తమ గ్రూపు సంస్థలు పనిచేస్తున్నాయని, తమ అనుభవం, విజ్ఞానం, సాంకేతిక పరిజ్ఞానం, ఇతర మేధో పరమైన సహకారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి అందిస్తామని సైరస్ మిస్త్రి ప్రకటించారు. ఉచిత నిర్బంధ విద్య అమలుకు కావలసిన శిక్షణా కార్యక్రమాలు, విద్యలో నాణ్యత పెంపొందించే అంశాలు, బోధనాపద్ధతులు తదితర విషయాల్లో తమ దగ్గర కావలసినంత మెటీరియల్ వుందని, ఇందుకోసం కేటాయించిన యంత్రాంగాన్ని తెలంగాణ ప్రభుత్వానికి సహకరించేందుకు ఉపయోగిస్తామని మిస్త్రి

చెప్పారు. తెలంగాణలో తమ ప్రతినిధులు గ్రామాల్లో పర్యటించి తరగతులను కూడా స్వయంగా చూసి కావలసిన సలహాలు ఇస్తారని వెల్లడించారు. హైదరాబాద్ నగరాన్ని స్లమ్ ఫ్రీ సిటీగా మార్చాలనే ముఖ్యమంత్రి నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేసిన మిస్త్రీ మంచి కాలనీలు నిర్మించడానికి, ఇప్పుడున్న స్లమ్స్‌లో మౌలిక వసతులు కల్పించి వాటి రూపు రేఖలు మార్చడానికి అవసరమైన విధానం, వ్యూహం ఖరారు చేసే విషయంలో తమకున్న అనుభవాన్ని తెలంగాణ రాష్ట్ర ం కోసం వినియోగిస్తామని మిస్త్రీ చెప్పారు. తక్కువ వేతనాలతో పనిచేస్తున్న వారు కుడా మెరుగైన జీవితాన్ని అందుకునే విధంగా కాలనీలు ఏర్పడాల్సిన అవసరం వుందని చెప్పారు. విద్యుత్ రంగంలో సోలార్ పంపు సెట్ల వాడకాన్ని పెంచాల్సి వుందని ముఖ్యమంత్రి అన్నారు. సోలార్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేయడం చాలా ఖర్చుతో కూడుకున్నందున తక్కువ ఖర్చుతో యూనిట్ల స్థాపన కోసం టాటా గ్రూపులు ఆలోచించాలని ముఖ్యమంత్రి కోరారు. ఈ విషయంలో తాము అధ్యయనం చేస్తున్నామని, త్వరలోనే ఫలితం సాధిస్తామని మిస్త్రీ చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రతి రంగంలో అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి మంచి ప్రణాళికలు వేస్తున్నారని, వాటికి తమ సంస్థలు పూర్తి సహకారం అందిస్తాయని వెల్లడించారు.

ఈ సమావేశంలో ఐటి శాఖ మంత్రి కె.తారకరామారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్ మిశ్రా, సిఎంఒ ముఖ్య కార్యదర్శి నర్సింగ్ రావు తదితరుల పాల్గొన్నారు.

---

**సిపిఆర్ఒ టు సిఎం**